# సాక్షి అనకాపల్లి

మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023




**త్వరలో 'జగనన్నకు చెబుదాం'**

ప్రజా సమస్యల పరిష్కారం కోసం త్వరలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు. 8లో



**మహిళలను ప్రోత్సహిస్తేనే..**

మహిళలకు చట్టసభల్లో సమాన ప్రాతినిధ్యం దక్కాల్సిన అవసరముందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. 8



**సినీ పరిశ్రమకు అనుకూలం**

విశాఖ: సినీ నిర్మాణానికి విశాఖ అనుకూలమని దర్శకుడు బీఎన్ ఆదిత్య అన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

## న్యూస్‌రీల్

### సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు

అనకాపల్లిటౌన్ : గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్టు ఎంపీ సత్యవతి సోమవారం తెలిపారు. ఆధార్‌కు మొబైల్, ఆధార్‌కు ఈ మెయిల్ ఐడీ లింకు, బయోమెట్రిక్(ఫొటో, ఐరిష్, ఫింగర్ ప్రింట్) అప్డేట్, పేరు మార్పు, ఆధార్ డాక్యుమెంట్ అప్డేట్, చిరునామా మార్పు, కొత్తగా ఆధార్ నమోదు, ఆధార్ డౌన్‌లోడ్ తదితర సేవలు అందించనున్నట్టు ఆమె పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.

### నేడు, రేపు కమ్యూనికేషన్ శాఖ ఫొటో ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్ ప్రచార వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 7, 8 తేదీల్లో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్ (విశాఖపట్నం) నిర్వహించే ఫొటో ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేయాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం కోరారు. ఎగ్జిబిషన్ వాహనాన్ని సోమవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్వాతంత్య్రం వచ్చాక దేశం సాధించిన విజయాలపై ప్రదర్శనను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ ప్రదర్శనను ఉచితంగా తిలకించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ మహమ్మద్ షఫీ, మున్సిపల్ కమిషనర్ కనకారావు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో జ్యోతి, సీడీపీవో మేరీ సువార్త, ఏడీ సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

### ప్లాస్టిక్ నియంత్రణ, స్మారక చిహ్నాలపై ఎంపీ సత్యవతి ప్రశ్నలు

అనకాపల్లి టౌన్: దేశంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తయారీ, దిగుమతులు, నిల్వలు, పంపిణీ, అమ్మకం, వాడకంపై నిషేధాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటని పార్లమెంట్‌లో అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి ప్రశ్నించారు. ప్లాస్టిక్ తగ్గింపును పర్యవేక్షించడానికి తీసుకున్న చర్యల గురించి అడిగారు. పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ మంత్రి అశ్వినికుమార్ చౌబే బదులిస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న నియంత్రణ చర్యల గురించి వివరించారు. ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ 2022 జూలై 1న అమలులోకి వచ్చాయని సమాధానమిచ్చారు. గత ఐదేళ్లలో దేశంలోని స్మారక చిహ్నాల సంఖ్యను పెంచడానికి తీసుకున్న చర్యల గురించి ప్రశ్నించగా.. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి బదులిస్తూ.. స్మారక కట్టడాల గురించి వివరించారు. ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పరిరక్షణ చర్యలు చేపట్టిందని బదులిచ్చారు.

### హోం గార్డు నిజాయితీ

- నగదుతో దొరికిన పర్స్ అప్పగింత



పోగొట్టుకున్న పర్స్ అందజేస్తున్న సీఐ రంగనాథం

సబ్బవరం: నగదుతో దొరికిన పర్సును పోలీస్ స్టేషన్‌కు అప్పగించి హోంగార్డు నిజాయితీ చాటుకున్నారు. కాళ్ల కోటేశ్వరరావు అనే హోంగార్డు సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఆయనకు నగదుతో ఉన్న పర్స్ దొరకడంతో పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. పోలీసులు పర్సును పరిశీలించగా అందులో రూ.7,600 నగదుతో పాటు ఆధార్ కార్డు, సీ బుక్ ఉన్నాయి. వాటిలో ఉన్న అడ్రస్ ఆధారంగా విచారణ చేసి పర్స్ పోగొట్టుకున్న వ్యక్తి ఇరువాడకు చెందిన గొంతిన సత్తిబాబుగా గుర్తించారు. దీంతో సోమవారం పోలీస్ స్టేషన్‌లో సీఐ రంగనాథం హోమ్ గార్డు చేతులమీదుగా సత్తిబాబుకు పర్సును అందజేశారు. హోమ్ గార్డును అభినందించారు. నిబద్ధతతో విధులు నిర్వహించడంతో కోటేశ్వరరావు గతంలో అనేకసార్లు ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు పొందారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

### ఆర్టీసీకి రూ.9.11 లక్షల ఆదాయం

అనకాపల్లి టౌన్: ఈ ఏడాది మాఘపౌర్ణమిని పురస్కరించుకొని ప్రజా రవాణా వ్యవస్థ (ఆర్టీసీ) అనకాపల్లి డిపోకు రూ.9 లక్షల 11 వేల 302 ఆదాయం లభించిందని జిల్లా రవాణాశాఖ (డీటీపీవో) అధికారి పద్మావతి సోమవారం వెల్లడించా రు. అనకాపల్లి–పూడిమడక ప్రత్యేక బస్సుల ద్వా రా మంచి ఆదాయం సమకూరిందన్నారు. డ్రైవ ర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బందిని అభినందించారు.

# పేదల ఇంట.. వెలుగుల పంట



చోడవరం జగనన్నకాలనీ లేఅవుట్‌లో కాంతులీనుతున్న విద్యుత్ లైట్లు

- జగనన్న కాలనీల్లో ఉచితంగా కరెంటు మీటర్లు
- పూర్తయిన ఇళ్లలో శరవేగంగా విద్యుదీకరణ పనులు

**నిధులు వెచ్చిస్తారిలా..**

| నియోజకవర్గం | కాలనీలు | నిధులు రూ. కోట్లలో |
|---|---|---|
| అనకాపల్లి | 30 | 7.7 |
| యలమంచిలి | 74 | 8.4 |
| పాయకరావుపేట | 164 | 12.8 |
| నర్సీపట్నం | 181 | 9.5 |
| చోడవరం | 103 | 11.3 |
| మాడుగుల | 98 | 9.0 |
| పెందుర్తి | 23 | 3.3 |



మునగపాక జగనన్న కాలనీ లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు

**జిల్లాలో పరిస్థితి**

- మొత్తం జగనన్న కాలనీలు 673
- విద్యుదీకరణ పూర్తయినవి 151
- పురోగతిలో ఉన్నవి 264

సాక్షి, అనకాపల్లి: 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్లు నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో శాశ్వత మౌలిక సదుపాయాల కల్పన శరవేగంగా జరుగుతోంది. నిరుపేదలు నివసించే జగనన్న కాలనీల్లో ప్రభుత్వం ఉచితంగా అందించే విద్యుత్ సర్వీసు పనులు ఊపందుకున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదోడి సొంతింటి కల సాకారమైంది. ఉచితంగా స్థలం ఇచ్చి, ప్రభుత్వమే ఇళ్లు నిర్మిస్తూ.. శాశ్వత మౌలిక సదుపాయాలు కూడా కల్పిస్తోంది. పునాది దశను దాటిన లేఅవుట్లలో ఈ పనులను చేపడుతున్నారు. జిల్లాలో తొలి దశలో విద్యుత్ స్తంభాలు, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి, నిర్మాణాలు పూర్తయిన ఇళ్లల్లో మీటర్లను కూడా బిగిస్తున్నారు. దీని కోసం ప్రభుత్వం రూ.62.35 కోట్ల నిధులు వెచ్చిస్తోంది.

**ప్రతి ఇంటికీ ఉచితమే..**

జగనన్న కాలనీల్లో నిర్మించే ప్రతి ఇంటికీ ఒక కిలోవాట్ సామర్థ్యంతో విద్యుత్ సర్వీసు మంజూరు చేశారు. లబ్ధిదారుల ఇంటికి ఉచితంగానే విద్యుత్ మీటర్ల సౌకర్యం కల్పిస్తున్నారు. మీటరు బోర్డు, సర్వీసు వైరు, ఎంసీబీ స్విచ్‌లు అందజేస్తారు. ఒక్కో ఇంటికి సుమారు రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు ఖర్చవుతుంది. వీటిని ప్రభుత్వమే భరిస్తోంది. లబ్ధిదారులు మీటరు సర్వీసు కోసం పైసా ఖర్చు చేయాల్సిన పనిలేదు.



అచ్యుతాపురం మండలం వెదురువాడ లేఅవుట్‌లో విద్యుదీకరణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

### నిర్మాణం పూర్తయిన ఇళ్లకు ఉచితంగానే మీటర్లు



జగనన్న కాలనీలకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఇళ్ల నిర్మాణం కంటే ముందుగానే బోర్‌వెల్స్‌కు ఉచితంగా కరెంటు కనెక్షన్ ఇచ్చాం. ఇప్పుడు కాలనీల్లో విద్యుదీకరణ పూర్తి చేస్తున్నాం. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు మీటర్లు అమర్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టాం. లబ్ధిదారుడే సొంతంగా ఇంటి నిర్మాణం చేపట్టినా.. జగనన్న కాలనీల్లో ఇల్లు నిర్మించుకుంటున్నా కూడా విద్యుత్ మీటర్లు ఉచితంగానే ఏర్పాటు చేస్తున్నాం.

–రమణమూర్తి, జగనన్న కాలనీ నోడల్ అధికారి

# నేత్రపర్వంగా పుష్పాంజలి



ఊయలలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేతుడైన కేశవస్వామి

- ముగిసిన కేశవస్వామి 750వ వార్షిక బ్రహ్మోత్సవాలు

చోడవరం: శ్రీ కేశవస్వామివారి పుష్పాంజలి సేవ కనువిందుగా జరిగింది. వందలాది మంది భక్తులు స్వామివారి ఊంజల్ సేవలో పాల్గొని తరించారు. ఉత్తరాంధ్రలో ప్రాచీన దేవాలయాల్లో ఒకటైన చోడవరం శ్రీ కేశవస్వామివారి 750వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రితో ముగిశాయి. జనవరి 31వ తేదీ నుంచి ఈ ఉత్సవాలు ప్రారంభమై ఏడు రోజులపాటు అంగరంగ వైభవంగా జరిగాయి. సోమవారం రాత్రి జరిగిన స్వామివారి పుష్పాంజలి సేవ నేత్రపర్వంగా సాగింది. శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీకేశవస్వామివారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణాన్ని రకరకాల పూలతో సర్వాంగసుందరంగా తయారు చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఊయలలో శ్రీదేవి, భూదేవి, కేశవస్వామి ఉత్సవమూర్తులను ఉంచి వేదపండితుడు సీతారామాచార్యులు ఆధ్వర్యంలో ఊంజల్ సేవ చేశారు. పూలు, రకరకాల పండ్లు, స్వీట్లతో అంతా అలంకరించారు. ఉత్సవ మూర్తులకు చోడవరం పురవీధుల్లో వైభవంగా తిరువీధోత్సవం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పప్పల జయదేవ్, ఉత్సవ కమిటీ చైర్మన్ ఆలమండ ఈశ్వరరావు, ఈవో సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

# పోలాండ్‌లో తెలుగువారి పెద్ద మనసు

- ఉపాధి కోసం వెళ్లి మృతి చెందిన తోటకూరపాలెం యువకుడు
- యాజమాన్యం పట్టించుకోకపోయినా ఆదుకున్న తెలుగువారు
- మృతదేహాన్ని పంపడంతోపాటు కుటుంబానికి రూ.2.94 లక్షల ఆర్థిక సాయం



సన్యాసినాయుడు తండ్రికి చెక్కు అందిస్తున్న సర్పంచ్ సోమునాయుడు (కుడి)

రావికమతం: పోలాండ్ దేశంలో స్థిరపడిన తెలుగువారు పెద్ద మనసు చాటుకున్నారు. ఉపాధి కోసం ఆ దేశానికి వెళ్లి మృతి చెందిన అనకాపల్లి జిల్లావాసి కుటుంబానికి వెన్నుదన్నుగా నిలిచారు. తోటకూరపాలెం గ్రామానికి చెందిన యాకా సన్యాసినాయుడు (19) మూడు నెలల క్రితం గాజువాకలో ఉన్న ఒక ఏజెంట్ ద్వారా పోలాండ్ దేశం వెళ్లి అక్కడ ఒక కంపెనీలో చిన్నపాటి పనిలో చేరాడు. అక్కడ ఆరోగ్యం పాడవ్వడంతో గతేడాది డిసెంబర్ 21న అకస్మాత్తుగా మరణించాడు. అతని పనిచేసిన కంపెనీ నష్టపరిహారానికి, మృతదేహాన్ని ఇండియాకు పంపేందుకు ముందుకు రాకపోవడంతో అక్కడి తెలుగు వారంతా తమ వాట్సప్ గ్రూపు ద్వారా ఈ విషయం అందరికీ తెలియజేసి మృతదేహాన్ని వారం రోజుల్లో ఇండియాకు పంపించే ఏర్పాట్లు చేశారు. అంతటితో సరిపెట్టకుండా చందాలు వేసుకొని, రూ.2,94,434 సేకరించి, ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో సోమవారం ఇక్కడికి పంపించారు. ఆ చెక్కును గ్రామ సర్పంచ్ రుత్తల ఎరుకు సోమునాయుడు సన్యాసినాయుడు తండ్రి మహాలక్ష్మణ్‌కు సోమవారం అందించారు. 'పోలాండ్‌లో ఉన్న తెలుగు వారందరికీ కృతజ్ఞతలు.. మీకు రుణపడి ఉన్నామం'టూ గ్రామస్తులు ఒక సందేశాన్ని పంపించి, ధన్యవాదాలు తెలిపారు.

# సీఎం జగన్ పాలనలో ప్రజల ఆరోగ్యానికి భరోసా

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- చౌడువాడలో పీహెచ్‌సీ నూతన భవనం ప్రారంభం
- రూ.4.68 కోట్లతో ఇంటింటికీ కుళాయి నిర్మాణానికి భూమిపూజ



పీహెచ్‌సీ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, డీఎంహెచ్‌వో హేమంత్‌కుమార్

కె.కోటపాడు: వైద్య రంగాన్ని చక్కగా అభివృద్ధి చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. చౌడువాడలో రూ.1.64 కోట్లతో నిర్మించిన పీహెచ్‌సీ నూతన భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పథకంలో 1,300 ఇళ్లకు కుళాయిల నిర్మాణంతోపాటు శారదానదిలో వెల్ నిర్మాణానికి రూ.4.68 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో జరగనున్న పనులకు భూమిపూజతో పాటు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతున్నారని అన్నారు.

గతంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో పూర్తిగా సిబ్బంది ఉండేవారు కాదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వైద్య సిబ్బంది నియామకాలను పారదర్శకంగా చేపడుతూ, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. డీఎంహెచ్‌వో హేమంత్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అల్లు సూర్యనారాయణ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైద్యులు నిర్మల, సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అల్లు శ్వేత పాల్గొన్నారు.

# ఫలితం 'పది'ంతలొచ్చేలా!

ప్రతి స్టూడెంట్‌పై వ్యక్తిగత శ్రద్ధ. ఎప్పటికప్పుడు తల్లిదండ్రులతో పిల్లల ప్రగతిపై సమావేశం. ఇంటి వద్ద ఎలా చదువుతున్నారో.. తెలుసుకునేందుకు ఫోన్ ద్వారా సమాచార సేకరణ.. ఇవన్నీ ఏదో కార్పొరేట్ స్కూల్ గురించి అనుకుంటే.. తప్పులో కాలేసినట్టే. జగనన్న ప్రభుత్వంలో జిల్లా విద్యాశాఖ ప్రభుత్వ స్కూళ్లలో సైతం వీటిని అమలు చేసి, అద్భుత ఫలితాలకు కృషి చేస్తోంది. ప్రైవేట్/కార్పొరేట్ యాజమాన్యాలు చేయని, చేయలేని విధంగా.. పాఠశాల పనివేళలు ముగిశాక టీచర్లకు కొత్త బాధ్యత అప్పగించింది. టీచర్లను రాత్రి పూట పిల్లల ఇంటికే పంపించి, వారిప్రిపరేషన్‌ను పరిశీలించడంతో పాటు, తల్లిదండ్రులకు కూడా బాధ్యత గుర్తు చేసి, శభాష్ అనిపించుకుంటోంది.



గ్రామంలో విద్యార్థుల ప్రిపరేషన్‌పై సూచనలిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు



దేవవరం స్కూల్ స్టడీ అవర్స్‌లో టెన్త్ విద్యార్థులు

నక్కపల్లి : ఈ ఏడాది పదోతరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ముందుకెళ్తోంది. వెనుకబడిన విద్యార్థుల కోసం పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ఉదయం, సాయంత్రం గంట చొప్పున అదనంగా రెండు గంటలు సబ్జెక్టుల వారీ, 'పది'ంతల ప్రిపరేషన్‌కు కృషి చేస్తోంది.

**409 స్కూళ్లు.. 23,916 మంది విద్యార్థులు**

వచ్చే ఏప్రిల్ 3 నుంచి 18 వరకు పదో తరగతి పరీక్షల నిర్వాహణకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. జిల్లాలో 409 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలున్నాయి. 22,235 మంది రెగ్యులర్ విద్యార్థులు, 1681 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులతోపాటు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులకోసం పాఠశాల పనివేళలు ముగిసిన తర్వాత కూడా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. స్కూళ్లతోపాటు హాస్టళ్లలో చదివే విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు.

- ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్
- సీ, డీ గ్రేడ్ల పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ
- రాత్రిళ్లు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పరిశీలన
- ఉత్తమ మార్కులు, అత్యుత్తమ ఉత్తీర్ణత
- టెన్త్‌లో మెరుగైన ఫలితాలకు విద్యాశాఖ చర్యలు

**నైట్ విజిట్స్‌తో ఫుల్ ప్రిపరేషన్**

గత కొన్నేళ్లుగా జిల్లా విద్యాశాఖ పదో తరగతి ఫలితాల కోసం కొత్తకొత్త ప్రయోగాలు, ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగానే తరగతి గదుల వరకే తమ బోధన పరిమితం కాకుండా.. ఇంటికెళ్లాక వారేం చేస్తున్నారన్నదానిపైనా ఆరా తీస్తున్నారు. అందు కోసం టీచర్లే రోజూ రాత్రిపూట కొంతమంది విద్యార్థుల ఇళ్లకు వెళుతున్నారు. పిల్లలు చదువుతున్నారో.. లేదో.. చూస్తున్నారు. తల్లిదండ్రులకు కూడా వారి బాధ్యతపై అవగాహన పెంచుతున్నారు.

**సర్కారీ స్కూళ్లలోనూ 'పీటీఎం'!**

పేరెంట్ టీచర్ మీటింగ్(పీటీఎం) ఇన్నాళ్లూ కార్పొరేట్ స్కూళ్లకే పరిమితమైన విధానం. దీన్ని కూడా ప్రభుత్వ స్కూళ్లు అమలు చేస్తున్నాయి. పదో తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రతి టీచర్ ఐదుగురు విద్యార్థులను దత్తత తీసుకుని వారు ఎన్ని గంటలకు నిద్రలేస్తున్నారు? రాత్రి ఎన్ని గంటలకు వరకు చదువుతున్నారు? అనే వివరాలను వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి కనుక్కోవాలి.

**'సెల్ఫ్'తో ఎంతో హెల్ప్**

సెల్ఫ్(సెల్ఫ్ ఎవాల్యుయేషన్ అండ్ లెర్నింగ్ ఫర్ ఫ్యూచర్) పేరిట స్వీయ మదింపు విధానాన్ని డీఈవో లింగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో తొలిసారిగా అనకాపల్లి జిల్లాలో ప్రయోగాత్మక కార్యక్రమాన్ని అమలు చేశారు. ఈ విధానం ద్వారా డీసీఈబీ రూపొందించిన ప్రశ్నాపత్రాన్ని ప్రతిరోజు ఉపాధ్యాయుల వాట్సాప్‌కు పంపించి దానిపై విద్యార్థులనుంచి సమాధానాలు రాబడుతున్నారు. ఏయే పాఠ్యాంశాల్లో వెనుకబడి ఉన్నారో తెలుసుకుని, వాటిపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నారు.



పాఠశాలలో పేరెంట్స్‌తో సమావేశం నిర్వహిస్తున్న హెచ్‌ఎం

### మంచి మార్కులు తెచ్చుకుంటా



స్కూల్లో ఉదయం, సాయంత్రం రెండు పూటలా ప్రత్యేక తరగతులు పెడుతున్నారు. డౌట్లు ఏమైనా ఉంటే అర్థమయ్యేలా మళ్లీ మళ్లీ చెప్తున్నారు. రాత్రిపూట కూడా టీచర్లు మా ఇళ్లకు వచ్చి ఎలా చదువుతున్నామో తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం చాప్టర్ల వారీ రివిజన్ జరుగుతోంది. మంచి మార్కులు తెచ్చుకుంటామనే నమ్మకం ఉంది. – గింజాల మున్నా, 10వ తరగతి

### స్టడీ అవర్స్‌తో ధైర్యం



మా స్కూల్లో టీచర్లు అన్ని సబ్జెక్టులూ బాగా బోధించారు. పబ్లిక్ పరీక్షలకు ఇంకా రెండు నెలల సమయం ఉంది. అయినప్పటికీ రెండు పూటలా స్టడీ అవర్స్ పెట్టడం వల్ల మాలో భయంపోయింది. క్లాస్‌లో చెప్పిన పాఠాల్లో కఠినమైన చాప్టర్లను స్టడీ అవర్స్‌లో మళ్లీ చెప్తున్నారు. ఎక్కువ మార్కులు సాధించగలనన్న నమ్మకం పెరిగింది. – కె.భవానీ, 10వ తరగతి

### మెరుగైన ఫలితాలకు కృషి

పదోతరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాం. సెల్ఫ్ విధానం ద్వారా ప్రతిరోజు విద్యార్థుల ప్రగతి తెలుసుకునేలా టెస్ట్ నిర్వహిస్తున్నాం. ఒక్కో టీచర్ చదువులో బాగా వెనుకబడిన ఐదుగురు విద్యార్థులను దత్తత తీసుకుని వారికి మంచి తర్ఫీదు ఇచ్చేలా చర్యలు చేపట్టాం.

– బి.లింగేశ్వరరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి

## క్లుప్తంగా

### జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు గబ్బాడ విద్యార్థి



విద్యార్థి అరవింద్‌తో హెచ్‌ఎం ఆనందరావు, పీడీ నాగేశ్వరరావు

నర్సీపట్నం: జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు నర్సీపట్నం మండలం గబ్బాడ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి రొంగల అరవింద్ ఎంపికయ్యాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు డాక్టరు బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయిలో పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. విద్యార్థి అరవింద్, పీడీ నాగేశ్వరరావులను హెచ్‌ఎం ఎస్.ఆనందరావు, స్కూల్ కమిటీ చైర్మన్ మాకిరెడ్డి వరలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

### కోడిపందాలపై పోలీసుల దాడి

రంపచోడవరం : మండలంలోని పెద బారంగి శివారు ప్రాంతంలో నిర్వహిస్తున్న కోడి పందాలపై ఆదివారం రాత్రి పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో 22 మందిని అరెస్టు చేసినట్టు సీఐ సురేష్ తెలిపారు. అలాగే 24 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

# త్వరలో 'జగనన్నకు చెబుదాం'

- ప్రజా సమస్యల పరిష్కారం కోసం కార్యక్రమం రూపకల్పన
- స్పందనలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ కల్పనాకుమారి

తుమ్మపాల: ప్రజా సమస్యల పరిష్కారం కోసం త్వరలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి ప్రభుత్వం రూపకల్పన చేస్తోందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్పందన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇవి పునరావృతం కాకుండా ఉండాలంటే సమస్య పరిష్కారం చేసి అర్జీదారుడ్ని సంతృప్తికరంగా చేయాలన్నారు. స్పష్టమైన రీతిలో సమాధానాలు ఇవ్వాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ ఆధారిత హాజరు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులను ఆదేశించారు. స్పందనలో మొత్తం 200 అర్జీలు నమోదయ్యాయి. కార్యక్రమంలో జేసీ కల్పనాకుమారి, డీఆర్వో పి.వెంకటరమణ పాల్గొన్నారు.

**అంగన్‌వాడీల సమస్యలపై ధర్నా**

పాదయాత్రలో ప్రస్తుత సీఎం జగన్ ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి, ఇచ్చిన మాట నెలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద జిల్లా అంగన్‌వాడీ సిబ్బంది ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుంటే, త్వరలో సీఎం ఇంటి ముట్టడి కార్యక్రమం చేపడతామన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. తొలుత స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ ఉషారాణి ధర్నా వద్దకు వచ్చి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ గౌరవాధ్యక్షురాలు జి.కుమారి, ప్రధాన కార్యదర్శి మజ్జి నాగేషు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ గౌతమిసాలి

**ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి**

జగనన్న కాలనీలో ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ వైఎస్సార్ గృహ నిర్మాణ పథకం పేరుతో ప్రభుత్వం మంజూరు చేస్తున్న రూ.1.80 వేలు ఏ మాత్రం సరిపోవడం లేదని, టిడ్కో ఇళ్లను తక్షణమే లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని కోరారు.

**హెచ్చరిక బోర్డులు తొలగించాలని వినతి**

జీవీఎంసీ విలీన గ్రామం వల్లూరు సర్వే నెం.159 ప్రభుత్వ భూమిలో ఇటీవల అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు తొలగించాలని రిక్షా కార్మికులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. 1993లో ప్రభుత్వం స్థలాలు ఇచ్చినప్పటికీ ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవడంతో సొంతిళ్లు నిర్మించుకోలేకపోయామని వాపోయారు.

**సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎస్పీ**

అనకాపల్లి టౌన్: ప్రజా సమస్యల పరిష్కారానికి సకాలంలో చర్యలు చేపట్టనున్నట్టు ఎస్పీ గౌతమిసాలి అన్నారు. తన కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో 32 అర్జీలు స్వీకరించినట్టు ఆమె తెలిపారు. చట్టపరిధిలో సమస్యలపై స్పందించిన ఆమె జిల్లాలో పలు పోలీస్ స్టేషన్ల అధికారులతో మాట్లాడారు.

## హిమోఫిలియా బాధితురాలికి రూ.10 వేల పింఛన్

- చిన్నారికి అందజేసిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



చిన్నారి కుసుమతో డిప్యూటీ సీఎం బూడి

కె.కోటపాడు: మండలంలోని చౌడువాడకు చెందిన విద్యార్థిని ధూళి కుసుమ(8) సివియర్ హిమోఫిలియా వ్యాధితో బాధపడుతోంది. తరచూ తీవ్ర రక్తస్రావం కావడంతో రోజురోజుకూ ఆరోగ్యం క్షీణిస్తోంది. ఈ విషయం వైఎస్సార్‌సీపీ నాయకులు దాట్ల శివాజీరాజు, ఏటుకూరి రాజేష్ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి తీసుకెళ్లారు. చిన్నారి తల్లిదండ్రులు అంజి, నూకరత్నం వ్యవసాయ కూలీలు కావడంతో వారి ఆర్థిక ఇబ్బందులను వివరించారు. దీంతో విద్యార్థిని అనారోగ్య సమస్యపై స్థానిక చౌడువాడ వైద్య సిబ్బందిని పరిశీలించాలని డిప్యూటీ సీఎం సూచించారు. వైద్యుల నిర్ధారణ మేరకు రూ.10 వేల పింఛన్ ఈ నెలలో మంజూరు చేశారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం సోమవారం చిన్నారికి అందజేసి ధైర్యం చెప్పారు. పేదరికం కారణంగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు సీఎం జగన్ అర్హులైన వారికి పింఛన్ మంజూరు చేస్తూ అండగా నిలుస్తున్నారని ప్రశంసించారు. చిన్నారి తల్లిదండ్రులు సీఎం, డిప్యూటీ సీఎంలకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఈఈఎఫ్ఐ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా 'వేపాడ'



ఎన్నికైన వేపాడ సత్యనారాయణ

చోడవరం రూరల్ : ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఈఈఎఫ్ఐ) వర్కింగ్ కమిటీ సభ్యుడిగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం యూఈఈయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుదర్శనరెడ్డి విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వర్కింగ్ కమిటీ సమావేశం మహారాష్ట్రలోని అమరావతి నగరంలో గత ఆదివారం జరిగిందని పేర్కొన్నారు. ఈ సమావేశానికి దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈఈఎఫ్ఐ అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడు ఈ.కరీం అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో వర్కింగ్ కమిటీ సభ్యునిగా వేపాడను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించిన ఆలిండియా ఫెడరేషన్ అధ్యక్షుడు కరీం కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాల ద్వారా ప్రతిఘటించాలని కోరారని ఈ సందర్భంగా వేపాడ తెలిపారు. వేపాడ ఎన్నిక పట్ల యూనియన్ సీనియర్ నాయకుడు కె.భాస్కరరావు, ఏపీఈపీడీసీఎల్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.శ్రీనివాస్, పి.వి.డి ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యుడు అప్పలసూరి, విశాఖ జిల్లా రీజియన్ అధ్యక్షుడు ప్రేమ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఆర్.సత్యారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ దార అప్పారావు, ఎల్.నూకరాజు, పి.శ్రీనివాస్ అభినందించారు.



## జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు టి.అర్జాపురం విద్యార్థులు



టి. అర్జాపురం విద్యార్థులు

రావికమతం: జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మండలంలోని టి.అర్జాపురం హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు పిల్లా పూర్ణ, రాజాన రమేష్‌నాయుడు ఎంపికయ్యారు. అండర్ -16 రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ఇటీవల ప్రకాశం జిల్లా చేవూరులో జరిగాయి. ఇందులో వీరిద్దరూ మంచి ప్రతిభ చూపించడంతో జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకూ తెలంగాణలోని మంచిర్యాల ప్రగతి స్టేడియంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ రమేష్‌నాయుడు తెలిపారు. సోమవారం అక్కడకు పయనమైన వీరిని సర్పంచ్ అర్జున, వైస్ ఎంపీపీ భవానీప్రసాద్, స్కూల్ కమిటీ చైర్మన్ శివయ్యనాయుడు, హెచ్‌ఎం కె.ఆర్.ఎస్.నాయుడు అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు, పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వీడ్కోలు పలికారు.

## రోడ్డు ప్రమాదంలో తాపీమేస్త్రి మృతి



చెట్టుని ఢీకొని మృతి చెందిన రాము (ఇన్‌సెట్) రాము (ఫైల్ )

రోలుగుంట : లగుడు కొత్తూరు గ్రామానికి చెందిన లగుడు రాము(35) గ్రామం నుంచి గుర్రాలపాలెం సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై వెళుతూ మార్గమధ్యంలో బల్జిపాలెం బెల్లం క్రషర్ సమీపంలో ప్రమాదవశాత్తూ చెట్టుని ఢీకొని మృతి చెందాడు. ఘటనపై మృతుడి పెదనాన్న లగుడు అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బి.నాగకార్తీక్ కేసు నమోదు చేశారు. సంఘటన స్థలానికి వెళ్లి స్థానికులను విచారించారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు వృత్తిరీత్యా తాపీ మేస్త్రి. భార్యతో కొన్నాళ్లుగా కలిసి ఉండడం లేదు. వీరికి పిల్లలు లేరు.



### ఆగి ఉన్న లారీని ఢీకొని యువకుడికి గాయాలు



గూడెంకొత్తవీధి : మండలంలోని ఆర్‌వీ నగర్‌కు చెందిన యువకుడు ఆగి ఉన్న లారీని ఢీకొని తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన పెద్దిశెట్టి వీరబాబు ద్విచక్రవాహనంపై నర్సీపట్నం వెళుతూ చింతపల్లి మండలం లోతుగెడ్డ జంక్షన్ వద్ద రోడ్డుపై ఆగి ఉన్న లారీని బలంగా ఢీ కొట్టాడు. దీంతో అతని తల వెనుక భాగంలో తీవ్రగాయమైంది. 108 వాహనంలో అతడిని చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు.

# మహిళలను ప్రోత్సహిస్తేనే దేశాభివృద్ధి

- ప్రాచీన కాలంలో మహిళలను దేవతలుగా కొలిచేవారు
- జెండర్ రెస్పాన్సిబిలిటీ వర్క్‌షాప్‌లో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



పాల్గొన్న మహిళా ప్రజాప్రతినిధులు

కొమ్మాది : ప్రాచీన కాలంలో మహిళలను దేవతలుగా కొలిచేవారని అందుకే నదులు పేర్లు కూడా స్త్రీల పేర్లమీదే ఉన్నాయని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. రుషికొండలో నిర్వహిస్తున్న జెండర్ రెస్పాన్సిబిలిటీ వర్క్‌షాప్‌లో భాగంగా షీ ఈజ్ ఏ చేంజ్ మేకర్ మహిళా ప్రజాప్రతినిధుల సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ, పురుషులిద్దరూ బండికి రెండు చక్రాలు వంటి వారని, సమాజంలో వారిని సమానంగా చూసిననాడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఒక వ్యక్తి చదువుకుంటే ఆ వ్యక్తికి మాత్రమే ఉపయోగపడుతుందని, ఒక స్త్రీ చదువుకుంటే కుటుంబమంతటికీ మేలు జరుగుతుందని చెప్పారు. మహిళలకు చట్టసభల్లో సమాన ప్రాతినిధ్యం దక్కాల్సిన అవసరముందన్నారు. మహిళలు శక్తి వంతంగా పనిచేయడానికి ఆర్థిక వనరులు కూడా సమకూర్చాలన్నారు. న్యాయకత్వంలో వైవిధ్యం, లింగ సమతుల్యత విలువను తక్కువగా అంచనా వేయకూడదని సూచించారు. నేషనల్ కమిషన్ ఫర్ ఉమన్ పాన్ ఇండియా కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ మహిళా నేతల విజయాలకు ఎంతగానో దోహద పడుతుందన్నారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ ఉమెన్ చైర్‌పర్సన్ రేఖా శర్మ మాట్లాడుతూ మహిళా సాధికారిత లేకుండా ఎవరూ ఎదగలేరని, పార్లమెంట్‌కు ఎక్కువ మంది మహిళలు ఎన్నిక కావడానికి తాము నిరంతరం మద్దతు ఇస్తున్నామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ దిశ పన్ను, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తాపడి ఒకరి మృతి

బుచ్చెయ్యపేట : మండలం శివారు గ్రామం రాజాం వద్ద ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. వివరాలివి. పరవాడ మండలం బర్నికం గ్రామానికి చెందిన గవిరెడ్డి సత్యారావు(43) రాజాం గ్రామంలో ఉన్న తన చెల్లెలు ఇంటికి వారం రోజుల కిందట పొలం పనుల కోసం ట్రాక్టర్ తీసుకుని వచ్చాడు. పొలం దుక్కులు దున్నుకుంటూ అక్కడే ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం తన చెల్లెలు భర్త సుంకరి సత్యారావుతో కలిసి పొలం పనులకు ట్రాక్టర్‌పై వెళ్తుండగా బ్రేక్ ఫెయిల్ అయి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ నడుపుతున్న గవిరెడ్డి సత్యారావు అక్కడికక్కడే మృతి చెందగా అతని బావమరిదికి గాయాలయ్యాయి. సంఘటన గురించి తెలుసుకున్న బుచ్చెయ్యపేట ఎస్‌ఐ కుమారస్వామి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. సత్యారావు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## అన్నప్రసాద పథకానికి విరాళం



సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సోమవారం కె.కోటపాడు మండలం రొంగలి నాయుడుపాలేనికి చెందిన కొల్లి శివప్రసాద్ అనే దాత లక్షా 1116 రూపాయల విరాళం అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు బాండ్‌ను ఆలయ ఇన్‌స్పెక్టర్ కనకరాజు అందజేసి స్వామివారి దర్శనం కల్పించారు. ప్రసాదం అందజేశారు.

## చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి



ప్రసాద్‌నాయుడును సత్కరిస్తున్న బీసీ సంఘాల నేతలు

అనకాపల్లిటౌన్ : బీసీలదే రాజ్యాధికారమని అఖిల భారత ఓబీసీ జాతీయ అధ్యక్షుడు పోతుల ప్రసాద్‌నాయుడు అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న విజయారెసిడెన్సీలో ఉత్తరాంధ్ర బీసీసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ ఆడారి కుమారస్వామి అధ్యక్షతన సోమవారం జరిగిన బీసీ సదస్సులో ఆయన మాట్లాడారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని పేర్కొన్నారు. బీసీ జనగణన జరగాలని, తెలంగాణలో రిజర్వేషన్ నిలిపివేసిన 26 కులాలను తక్షణమే బీసీలుగా పరిగణించాలని అన్నారు. ఏపీలో అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాల్లో జ్యోతిరావు పూలే విగ్రహాలు నిర్మించాలన్నారు. అంతకుముందు పట్టణంలో గాంధీనగరం బీసీ వసతి గృహంలో ఆయన సోమవారం మొక్కలు నాటి విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షురాలు రోజారమణి, షిర్డీసాయి లా కళాశాల అధినేత పెంటకోట వెంకటరావు, రాష్ట్ర బీసీ నేతలు కాండ్రేగుల చందు, జిల్లా నాయకుడు కె.ఎం.నాయుడు, పినబోయిన అప్పారావు యాదవ్, విల్లూరి పైడారావు, బొడ్డేడ అప్పారావు, యాత కార్పొరేషన్ డైరెక్టర్ పోలారపు అప్పారావు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణులు ఐక్యంగా ఉండాలి

- సంఘం జిల్లా అధ్యక్షుడు దిమిలి రాజేష్




గోడపత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

చోడవరం రూరల్ : జిల్లాలోని ప్రతి గ్రామంలోనూ వివిధ చేతి వృత్తులు చేస్తున్న విశ్వబ్రాహ్మణులందరూ ఐక్యంగా ఉండి సంఘాలుగా ఏర్పాటు కావాలని జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు దిమిలి రాజేష్ పిలుపు నిచ్చారు. సోమవారం స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఈనెల 18 నుంచి నిర్వహించనున్న కళ్యాణోత్సవాల గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ పథకాలే గాకుండా ఇతర సదుపాయాలను సాధించుకోవడానికి చేతివృత్తికారులంతా ఐక్య సంఘాలుగా ఉండాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ నెల 18న చోడవరంలో మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి వారికి జరగనున్న కల్యాణోత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. ముందుగా వీరబ్రహ్మేంద్రస్వామికి విశేష పూజలు చేసిన ఆయన కల్యాణోత్సవాల గోడపత్రికను ఆవిష్కరించారు. శ్రీ కామాక్షీ కార్పెంటర్స్ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దిమిలి రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ పట్నాల బ్రహ్మానందం, చోడవరం మండల అధ్యక్షుడు పాలతీర్థం దుర్గాప్రసాద్, మండల కన్వీనర్ నాని, కమిటీ సభ్యులు సూరిబాబు, హరిబాబు, గనివాడ నానాజీ, సంఘం ఉపాధ్యక్షుడు నాగోజి ప్రసాద్, పొన్నాడ శ్రీను పాల్గొన్నారు.

## కేంద్రంలో అవినీతి పాలన

- పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు



ర్యాలీ నిర్వహిస్తున్న పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు

అనకాపల్లి టౌన్: ప్రధాని మోదీ కనుసన్నల్లో కేంద్రంతోపాటు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అనేక కుంభకోణాలు జరిగాయని పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక గుండాల కూడలి నుంచి నెహ్రూ చౌక్ మీదుగా ఎల్ఐసీ కార్యాలయం వరకు సోమవారం ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్‌బీఐ, ఎల్ఐసీ వంటి సంస్థల్లో డిపాజిట్లు అంబానీ సంస్థలకు కట్టబెట్టి పేదలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. లోక్‌సభ, రాజ్యసభలో అఖిలపక్ష నేతలతో సమావేశాలు నిర్వహించేందుకు జాయింట్ పార్లమెంట్ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అఖిల భారత కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ కో ఆర్డినేటర్ కొప్పల రాజు, పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.రాకేష్‌రెడ్డి, యాత్ర కో-ఆర్డినేటర్లు మీసాల సుబ్బన్న, పార్టీ నేతలు వెంకటేష్, గుత్తుల శ్రీనివాస్, బోయిన భానుమూర్తియాదవ్, మల్లపురెడ్డి కోటేశ్వరరావు, ఐ.ఆర్.గంగాధర్ పాల్గొన్నారు.

## డిగ్రీ పరీక్షలు వాయిదా

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో ఈ నెల 10వ తేదీ నుంచి జరగాల్సిన డిగ్రీ పరీక్షలు వాయిదా వేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ టి.చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. యూజీ కోర్సుల సిలబస్ పూర్తికానందున, కళాశాలల ప్రిన్సిపాళ్ల నుంచి వచ్చిన వినతులు పరిశీలించి పరీక్షలను వాయిదా వేశామన్నారు. పరీక్షలు ఎప్పటి నుంచి నిర్వహించేది త్వరలో కళాశాలకు తెలియజేస్తామన్నారు.

## క్లుప్తంగా

### ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం


ప్రకృతి వ్యవసాయంపై ఉపాధి కూలీలతో అవగాహన ర్యాలీ

**కశింకోట :** మండలంలోని తాళ్లపాలెంలో సోమవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ ఉపాధి కూలీలతో ర్యాలీ నిర్వహించారు. రైతులు రుతు పవనాలకు ముందు నవ ధాన్యాలు, 30 రకాల విత్తనాలు పంట భూముల్లో నాటాలని పిలుపునిచ్చారు. ప్రకృతి సిద్ధంగా భూములను సారవంతం చేయాలని సూచించారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, సేంద్రియ ఎరువుల వినియోగం పై దృష్టి సారించి, ఆరోగ్యకరమైన పంటలను పండించాలని ఈ సందర్భంగా ప్ల కార్డులతో నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి డి.రమణ పాల్గొన్నారు.

### స్థిరంగా కూరగాయల ధరలు

**కశింకోట :** మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. ఉల్లి, టమాటా కిలో రూ.20, బంగాళాదుంపలు, వంకాయలు రూ.30, క్యారెట్, బెండకాయలు, దొండకాయలు రూ.40, బీట్‌రూట్, బజ్జీ మిరప, చిక్కుడు, బీరకాయ రూ.60, కాకర, క్యాప్సికం రూ.80కి విక్రయాలు సాగాయి.

### గొర్రెలు, మేకలకు పీపీఆర్ టీకాలు


త్రిపురవానిపాలెంలో గొర్రెలకు పీపీఆర్ టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

**కశింకోట :** గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని నరసింగబిల్లి పశు వైద్య కేంద్రం వైద్యాధికారి చైతన్య మణి సూచించారు. మండలంలోని నూతల గుంటపాలెం పంచాయతీ శివారు త్రిపురవాని పాలెంలో సోమవారం సుమారు 300 గొర్రెలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గొర్రెలకు సోకే పారుడు వ్యాధి వలన ముక్కు నుంచి చీము రావడం, జ్వరం, బరువు తగ్గిపోవడం వంటి లక్షణాలుంటాయన్నారు. దీని నివారణకు తమ కేంద్రంలో 2,700 డోసుల వ్యాక్సిన్ అందుబాటులో ఉందన్నారు. దీన్ని గొర్రెలు, మేకల పెంపకందార్లు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రాజేష్, అశ్విని పాల్గొన్నారు.

### బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 12,878 బెల్లం దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| స్పెషల్ | 3,500 | 4,200 |
| మొదటి రకం | 3,400 | 3,650 |
| రెండో రకం | 3,090 | 3,530 |
| మూడో రకం | 2,900 | 3,080 |

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| మైఖేల్ | - రాజా |
| బుట్ట బొమ్మ | - సత్యనారాయణ స్క్రీన్-1 |
| పఠాన్ | - సత్యనారాయణస్క్రీన్-2 |
| రైటర్ పద్మభూషణ్ | - షిర్డిసాయి |
| పఠాన్ | - పర్తిసాయి |
| వీరసింహారెడ్డి | - వెంకటేశ్వర |
| హంట్ | - శ్రీసత్య |
| వాల్తేరు వీరయ్య | - రామచంద్ర |

### రక్త నిల్వలు

**అనకాపల్లిటౌన్ :** జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 28 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు , బీ పాజిటివ్-5 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-8 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9182834480)ను సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

**అనకాపల్లిటౌన్ :** ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 487 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 451 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.



# జోరుగా రబీ సాగు

- ఊపందుకున్న వ్యవసాయ పనులు
- అత్యధికంగా నువ్వులు, వరి, చెరకు, టామాటా సాగు
- పంటల వివరాలు సేకరిస్తున్న అధికారులు


మార్టూరులో వరి నాట్లను పరిశీలిస్తున్న ఏవో రంగాచారి

**అనకాపల్లి రూరల్ :** అనకాపల్లి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో రబీ సీజన్ వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. కశింకోట, మునగపాక, అనకాపల్లి మండలాల్లో రైతులు పొలాలను సిద్ధం చేసుకుని పంటల సాగు ముమ్మరం చేశారు. ఈ మూడు మండలాల్లో అత్యధికంగా నువ్వులు, వరి, చెరకు, టమాటా పంటలను సాగు చేస్తున్నారు. కరెంటు బోరు బావులు, నీటి సౌలభ్యం వున్న రైతులు రబీలో వరిసాగు పనులు ప్రారంభించారు. నారును సిద్ధం చేసుకుని దుక్కులు, దమ్ములు ముగించుకుని వరి నాట్లు మొదలుపెట్టారు. నీటి సౌలభ్యత తక్కువగా వున్న రైతులు మొక్కజొన్న, మిర్చి, సన్‌ఫ్లవర్, కంది, మినుము, పెసర వేరుశనగ, కూరగాయల పంటలను సాగుచేస్తున్నారు. ఈ సారి సబ్ డివిజన్ పరిధిలో అక్కడక్కడా ఉద్యానపంటలను సైతం రైతులు సాగు చేస్తున్నారు. రైతులు పండిస్తున్న పంటలను ముందస్తుగా అంచనా వేసిన వ్యవసాయాధికారులు అందుకు తగ్గట్టుగా ఎరువులు, మందులను, ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచుతున్నారు.

**3,862 హెక్టార్లలో సాగు**

అనకాపల్లి డివిజన్‌లో 3,862 హెక్టార్లలో వివిధ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. దీంతో వ్యవసాయ కూలీలకు కూడా ఈ సీజన్‌లో డిమాండ్ బాగా పెరిగింది. వీటిలో ముఖ్యంగా 1830 హెక్టార్లలో చెరకు, 783 హెక్టార్లలో నువ్వులు, 382 హెక్టార్లలో టమాటా, 147 హెక్టార్లలో వరి, 112 హెక్టార్లలో మినుములు, 105 హెక్టార్లలో పొద్దు తిరుగుడు పువ్వు, 91 హెక్టార్లలో మొక్కజొన్న, 48 హెక్టార్లలో కూరగాయలు, ఇతర అంతర పంటలు, మిగతా విస్తీర్ణంలో రాగులు, వేరుశనగ సాగు చేస్తున్నారు.

**కలిసొచ్చిన ఖరీఫ్**

ప్రకృతి సహకరించడం, ఆర్‌బీకే ద్వారా ధాన్యం కొనుగోళ్లకు ప్రత్యేక సదుపాయాలు కల్పించడం, సకాలంలో ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు అందజేయడంతో ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు రైతులకు బాగా కలిసొచ్చింది. ఈ సంక్రాంతికి రైతు ఇంట గిడ్డంగులు ధాన్యం నిల్వలతో కళకళలాడాయి. ధాన్యం విక్రయాలు పూర్తయిన చోట మూడు వారాల్లోనే చెల్లింపులు కూడా జరిగిపోయాయి. దీంతో రైతులు ఆనందంగా రబీ సాగులోకి దిగారు.

**రైతు భరోసాతో ఆనందం**

నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రైతులకు ప్రభుత్వం రైతు భరోసా అందించింది. దీంతో పెట్టుబడులకు పెద్దగా ఇబ్బందుల్లేకపోవడంతో రైతులు ఆనందంగా వున్నారు. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందించడంతో పాటు, చీడపీడల విషయంలో అవసరమైన ప్రతిసారీ వ్యవసాయ నిపుణుల సలహాలు, సూచనలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. రైతు భరోసా కేంద్రంలో అదనంగా ఏర్పాటు చేసిన వలంటీర్లు రైతులకు అన్నింటా వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. దీంతో గతంతో పోల్చితే సాగు మరింత లాభదాయకంగా ఉంటుందన్న ధీమా రైతుల్లో బలపడుతోంది.


నువ్వు పంటలో సస్యరక్షణ చర్యలను రైతులకు వివరిస్తున్న అధికారులు

**సూచనలు పాటించాలి**



రైతులు వ్యవసాయశాఖ సూచనలు పాటిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు తెచ్చుకోవడానికి కృషిచేయాలి. విత్తన శుద్ధి వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. మోతాదుకు మించి ఎరువులు అధికంగా వాడటం సరికాదు. రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించే సేవలను సద్వినియోపరచుకోవాలి.

– పీయూబీపీ రంగాచారి, ఏవో, అనకాపల్లి

## గంజాయి నిర్మూలనకు వినతి

**అనకాపల్లిటౌన్:** గంజాయి నిర్మూలనకు కఠిన చర్యలు చేపట్టాలని ప్రజాసంఘాల నేతలు కోరారు. డివిజన్ ఎక్సైజ్ ప్రొహిబిషన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో సీఐ అనురాధను మర్యాదపూర్వకంగా నేతలు కలిశారు. ఈ మేరకు సోమవారం వినతిపత్రం అందించారు. విద్యార్థులు గంజాయి మత్తుకు బలై పోతున్నారని, స్మగ్లర్లకు అడ్డుకట్ట వేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొట్టా చిన్ని యాదవ్, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, బొబ్బిలి గోవింద, పల్లా సత్య అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


సీఐ అనురాధకు వినతిపత్రం అందిస్తున్న ప్రజా సంఘాల నేతలు

## కరాటేలో సెయింట్ జాన్స్ విద్యార్థుల ప్రతిభ

**కశింకోట :** స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్‌కి చెందిన ఐదుగురు విద్యార్థులు 2వ అంతర్ రాష్ట్ర రేయన్ ర్యు కరాటే చాంపియన్‌షిప్‌లో ప్రతిభ చూపి పతకాలు సాధించారు. ఇటీవల కాకినాడలో రేయన్ ర్యు షాటోకాన్ కరాటే డొ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో పాల్గొన్న స్కూల్ విద్యార్థులు ఎ.సంజన, ఎ.లోహిత్ ప్రథమ స్థానం, పీఎస్ఎస్ ఎస్ హర్ష, పి.నివాద శ్రీనివాస్ ద్వితీయ స్థానం, ఎన్.శంశాంక్ తృతీయ స్థానంలో నిలిచి పతకాలు సాధించారు. విజేతల్ని, వీరికి శిక్షణ ఇచ్చిన కరాటే కోచ్ సీహెచ్ అప్పారావును ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వి.మహేష్, అకడమిక్ ఇన్‌చార్జి రూపానంది ని, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.


అంతర్ రాష్ట్ర కరాటే చాంపియన్‌షిప్‌లో బహుమతులు పొందిన విద్యార్థులు

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**అనకాపల్లిటౌన్ :** జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా మంగళవారం పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని విద్యుశాఖ ఈఈ ఎస్.రమణమూర్తి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గాంధీబొమ్మజంక్షన్, రింగ్‌రోడ్డు, పెరుగుబజారు కూడలి, చిన్నవీధి, చేపలబజారు కూడలి, నెయ్యిల వీధి ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు వారి కార్యకలాపాలను ముందుగా నిర్వహించుకుని తమకు సహకరించాల్సిందిగా కోరారు.

## 9, 10 తేదీల్లో ఎస్ఎస్‌వై మేళా

**అనకాపల్లిటౌన్ :** స్థానిక పోస్టాఫీసులో ఈ నెల 9, 10 తేదీల్లో సుకన్య సమృద్ధి యోజన(ఎస్ఎస్‌వై) ఖాతాలు తెరవనున్నట్టు పోస్టల్ సూపరింటెండెంట్ ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ కార్యాలయంలో రెండు రోజుల పాటు మెగా మేళా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. 10 సంవత్సరాలలోపు వయసున్న బాలికలకు నెలకు కనీస మొత్తం రూ.250 నుంచి గరిష్ట మొత్తం రూ.12,500తో ఎస్ఎస్‌వై ఖాతా ప్రారంభించవచ్చని ఆయన వెల్లడించారు.

## కోటంరెడ్డి, ఆనంలు అవకాశవాదులు

- కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం

**నక్కపల్లి :** వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి, జగన్‌మోహన్ రెడ్డికి ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలే అండ అని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ అన్నారు. సోమవారం ఆయన నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. అవకాశవాద ఎమ్మెల్యేల వల్ల పార్టీకి వచ్చే నష్టం ఏమీ లేదని నెల్లూరుకు చెందిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డిలను ఉద్దేశించి అన్నారు. కేవలం మంత్రి పదవులు ఇవ్వలేదన్న అక్కసుతో పార్టీపై నిందలు వేయడం సరి కాదన్నారు. ఇలాంటి అవకాశవాద ఎమ్మెల్యేల పట్ల పార్టీ తీసుకున్న నిర్ణయం సరైనదేనన్నారు. పదవులను ఆశించి వచ్చే నాయకులు పార్టీకి విధేయులుగా ఉండరన్నారు. ఏ పదవి ఆశించకుండా పదేళ్ల నుంచి కష్టపడి పనిచేస్తున్న కార్యకర్త లే పార్టీకి నిజమైన వారసులన్నారు. సైనికుల్లా కష్టపడి పనిచేసి వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంని చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. 2010 నుంచి వైఎస్సార్‌సీపీ ఓటు బ్యాంకు ఎక్కడా చెక్కు చెదరలేదన్నారు. ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే ధైర్యం ఒక్క వైఎస్సార్‌సీపీకే ఉందన్నారు. కార్యకర్తలు కాలర్ ఎగరేసుకుని తిరిగేలా పార్టీల కతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పాదయాత్ర పేటెంట్ వైఎస్సార్ కుటుంబానిదేనన్నారు. లోకేష్ యాత్ర వల్ల ఒరిగేదేమీలేదన్నారు. జగనన్న ప్రభు త్వం ప్రజలకు ఏం అవసరమో అదే చేస్తోందన్నా రు. ప్రజలు మళ్లీ ఆయనకే అధికారం కట్టబెడతారన్నారు.

## ముగిసిన పొన్నగంటి అంత్యక్రియలు

**కశింకోట :** మండలంలోని నరసింగబిల్లిలో టీడీపీకి చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పొన్నగంటి నూకరాజు మృతదేహానికి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం ఆయన మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, టీడీపీ శ్రేణులు, వైఎస్సార్ సీపీకి చెందిన స్థానిక సర్పంచ్‌లు కోన అరుణ, కొట్టె రాము, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు, స్థానిక నాయకులు, అభిమానులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపం తెలిపారు.

## గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్న పొక్లెయిన్, ట్రాక్టర్ స్వాధీనం

**సబ్బవరం :** మండలంలోని ఆరిపాక శివారులోని వెంకటరావు చెరువులో గ్రావెల్, మట్టి అక్రమంగా తరలిస్తున్న పొక్లెయిన్, ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సీఐ రంగనాథం సోమవారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బంది ఆదివారం రాత్రి దాడి చేసి గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారన్నారు. వాహనాలపై కేసులు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకునేందుకు తహసీల్దార్‌తో పాటు మైనింగ్, ఇరిగేషన్ అధికారులకు అప్పగిస్తామన్నారు.


ఆరిపాక శివారులో పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్, పొక్లెయిన్

## ఐదుగురు ఆటోడ్రైవర్లపై కేసులు

**కశింకోట :** కశింకోటలో నిబంధనలు ఉల్లంఘించిన ఐదుగురు ఆటో డ్రైవర్లపై సోమవారం కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. స్థానిక జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించని ఆటో డ్రైవర్లపై కేసు నమోదు చేశామన్నారు.

## ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటింటికీ వైద్యసేవలు

**మునగపాక :** ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తిమ్మరాజుపేట ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్ కోరారు. తిమ్మరాజుపేట సచివాలయ ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకువచ్చిన ఫ్యామిలీ డాక్టర్ విధానం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలందుతున్నాయని పేర్కొన్నారు. వైద్యాధికారులు ఇంటింటికీ వచ్చి వైద్య పరీక్షలు చేస్తున్నారన్నారని, వారి సేవలను ప్రజలు ఎంతగానో ఆదరిస్తున్నట్టు చెప్పారు. చూచుకొండ వైద్యాధికారి ఎస్తేర్ రాణి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు.


తిమ్మరాజుపేటలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

## టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పరిచయం

**అనకాపల్లి టౌన్:** టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావును రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో పార్టీ కార్యకర్తలకు పరిచయం చేశారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్, బీసీ సాధికార సమితి రాష్ట్ర గవర కన్వీనర్ మళ్ల సురేంద్ర పాల్గొన్నారు.

## ధర్మ పరిరక్షణలో భాగస్వాములు కండి

**అచ్యుతాపురం(అనకాపల్లి):** ఇంటింటికి ధర్మ ప్రచారం చేస్తూ హిందూ ధర్మ పరిరక్షణలో భాగస్వాములవుతున్న సమరసతా సేవా ఫౌండేషన్‌కు మద్దతు ఇవ్వాలని ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ బి.వి.రమణ కోరారు. సోమవారం అచ్యుతాపురంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవాలయాలు నిర్మించడం, పేదలను దివ్య దర్శనానికి తీసుకెళ్లడం, ధర్మ పరిరక్షణకు సంబంధించి పలు కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా భక్తులకు సమరసతా సేవా ఫౌండేషన్ మరింత దగ్గరయ్యిందన్నారు. రానున్న రోజుల్లో బడుగు, బలహీన వర్గాలకు చెందిన భక్తులను దివ్యదర్శనాలకు తీసుకెళ్లేందుకు మరింతగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లి అప్పారావు, బంటు రాము, ద్వారపురెడ్డి బాబ్జి, కొమ్మోజు ఈశ్వరరావు పాల్గొన్నారు.

## బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

**అచ్యుతాపురం(అనకాపల్లి):** ఆవ సోమవరం పంచాయతీ సానికాలువ నుంచి ఎరుకురెడ్డిపాలెం వాటర్ ట్యాంక్ ఆర్అండ్‌బీ రోడ్డు వరకూ నిర్మించనున్న బీటీ రోడ్డుకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొబ్బరి కాయలు కొట్టి రోడ్డు పనులను ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ దంపతులు కోలా అప్పలరాజు, నాగమణి, ఎంపీపీ కోన సంధ్య బుజ్జి, లచ్చన్నాయుడు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, చోడపల్లి ఎంపీటీసీ లాలం శ్రీను, కొరుప్రోలు అప్పారావు, వరహాలు, పిల్లి సత్తిబాబు పాల్గొన్నారు.

## రైతులకు అన్యాయం చేసే బడ్జెట్


విలేకర్లతో మాట్లాడుతున్న రైతు సంఘం ప్రతినిధులు

**అనకాపల్లి రూరల్:** నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ రైతాంగానికి, గ్రామీణ పేదలకు తీవ్ర అన్యాయం చేసేదిగా ఉందని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.బాలకృష్ణ ఆక్షేపించారు. సోమవారం అనకాపల్లిలోని ఏపీ కౌలు రైతు సంఘం ప్రతినిధులు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తూ వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల వ్యవసాయరంగం మరింత సంక్షోభంలో కూరుకుపోతుందన్నారు. రైతుల ఆత్మహత్యలు మరింత పెరిగిపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు కాండ్రేగుల రాము మాట్లాడుతూ ఈ బడ్జెట్‌కు నిరసనగా ఈ నెల 9న దేశ వ్యాప్తంగా రైతులు బ్లాక్‌డేగా పాటించాలని పిలుపునిచ్చారు. పోరాడి సాధించిన జాతీయ ఉపాధి హామీ పథకాన్ని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసే విధంగా బడ్జెట్‌లో రూ.300 కోట్లు మేర కేటాయింపులు తగ్గించిందని ఆవేదన వెలిబుచ్చారు. ఎరువులపై రూ.500 కోట్లు భారం పెంచడమే దీనికి నిదర్శనమన్నారు.

## గృహసారథులతో సంక్షేమం మరింత చేరువ

**అనకాపల్లిటౌన్ :** రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకే ప్రతి సచివాలయంలో ముగ్గురు కన్వీనర్లను నియమించినట్టు వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. సోమవారం 80వ వార్డు పరిధిలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనను ప్రజల వద్దకు చేరవేసేందుకే గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారని కొనియాడారు. ఈ ముగ్గురు కన్వీనర్లకు ఒక్కొక్క వలంటీర్ పరిధిలో ముగ్గురు గృహసారథులను నియమిస్తున్నామని, వీరిలో ఇద్దరు పురుషులు, ఒక మహిళ ఉంటారన్నారు. కార్యక్రమంలో పార్టీనేతలు కొణతాల మురళీకృష్ణ, కొణతాల భాస్కర్, బొడ్డేడ శంకరరావు, శిలపరశెట్టి బాబి, భీశెట్టి కృష్ణ అప్పారావు, పొలిమేర శివ అప్పారావు, కర్రి అప్పారావు, కె.ఆరుద్ర పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న దాడి రత్నాకర్

## ఎస్సీ, ఎస్టీలకు ప్రకృతి వ్యవసాయ రుణం

**కశింకోట :** ప్రకృతి వ్యవసాయం చేయడానికి ముందుకు వచ్చే ఎస్సీ, ఎస్టీలకు చెందిన రైతులకు రూ.40 వేల వరకు రాయితీపై రుణం ఇవ్వనున్నట్టు ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి డి.రమణ తెలిపారు. మండలంలోని బంగారయ్యపేటలో సోమవారం రాత్రి ఎస్సీ, ఎస్టీలకు చెందిన రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఆరోగ్యకరమైన పంటలను సేంద్రీయ ఎరువులతో పండించాలని పిలుపునిచ్చారు. దీన్ని ప్రోత్సాహించేలా ప్రభుత్వం రుణాలు ఇస్తోందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఓబీలు ఎస్.గౌరీ శంకర్, సీహెచ్ గోవిందమ్మ, ఎంసీఆర్‌పీ కె.దేవి, వి.లక్ష్మి, వీవోఏ బి.రూప తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి రమణ

## కుమ్మరి కులస్తులకు ప్రభుత్వం చేయూత

**అనకాపల్లిటౌన్ :** కుమ్మరి కులస్తులను ప్రభుత్వం చేయూత ద్వారా ఆదుకుంటుందని కుమ్మరి శాలివాహన సంఘాల డైరెక్టర్ దేవరపు అర్జున వెంకటరావు అన్నారు. గుండాల కూడలిలోని ప్రైవేటు భవనంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కులస్తులందరూ ఐక్యంగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అర్హులై ఉండీ ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు రాని వారుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అంతకు ముందు ఆయన సంఘ పెద్దల సమక్షంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ అప్పలకొండ, కార్యదర్శి రామస్వామి, కోశాధికారి ఎం.సత్యనారాయణ, జిల్లా నేతలు పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం

**సబ్బవరం:** ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి రైతులకు బాసటగా నిలవాలని వ్యవసాయ శాఖ సిబ్బందికి ఎంపీపీ బోకం సూర్యకుమారి సూచించారు. మండలంలోని గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సోమవారం ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 15 నాటికి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకూ మండలంలో 300 మెట్రిక్ టన్నుల వరకూ ధాన్యం కొనుగోలు చేసినట్టు వ్యవసాయ శాఖ సిబ్బంది తెలిపారు. మరో 320 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దేముడుబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బోను గంగునాయుడు, మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, వీపీఏ హేమలత, ఏఈవో బాలరాజు పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి

## ప్రత్యేక శ్రద్ధతో పాఠ్యాంశాలు బోధించాలి

- డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్

**పరవాడ:** పదో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని యలమంచిలి ఉప విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ సూచించారు. ధర్మారాయుడుపేట జిల్లా పరిషత్ పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. తొలుత మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలించారు. రోజు వారీ మెనూను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వంటకాల విషయంలో ఎలాంటి లోటుపాట్లు వచ్చినా సహించబోమని మెనూ ప్రకారం తయారు చేయాలని సూచించారు. అనంతరం చదువుపై శ్రద్ధ చూపించి మంచి ఉత్తీర్ణత శాతం నమోదు చేయాలని విద్యార్థులకు డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్ సూచించారు. హెచ్ఎం లక్ష్మీప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్, హెచ్ఎం లక్ష్మీప్రసన్న

## చెరువులో ఆక్రమణలు తొలగించాలని వినతి

**సబ్బవరం:** మండలంలోని బంగారమ్మపాలెం సోమునాయుడు చెరువులో ఆక్రమణలు తొలగించి హద్దులు గుర్తించాలని సోమవారం తహసీల్దార్ సత్యనారాయణకు సర్పంచ్ దాడి లావణ్య ఫిర్యాదు చేశారు. బంగారమ్మపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 49, 52లలో ఈ సాగునీటి చెరువు విస్తరించి ఉందన్నారు. కొంత కాలంగా ఈ చెరువు ఆక్రమణలకు గురవుతోందన్నారు. చెరువులోని ఆక్రమణలను తొలగించి హద్దులు నిర్ధారించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. సర్పంచ్‌తో పాటు దాడి కన్నంనాయుడు తదితరులు ఉన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్